ఈ గులాబికీ ముళ్ళున్నాయి...

లేత గులాబీ రంగు కవరు, ముత్యాల్లాంటి అక్షరాలు, తన చిరునామా...

తనకే పదేపదే చూడాలనిపిస్తోంది. కంటి తోనే కాదు చేత్తోనూ తడిమి చూసుకున్నాడు సుబ్బారావు. ఫ్రమ్ అడ్రస్ చూశాడు.

శాంతి,హైదరాబాద్

పేరు బాగుంది. ఎవరు ఈ శాంతి? చేతి రాతను బట్టీ, పేరును బట్టీ చూస్తే అమ్మాయే అనిపిస్తోంది. వెంటనే మనసులో ఓ మెరుపు మెరిసింది.

తను చదువుకున్న కాలేజీ బ్యూటీ శాంతి కాదు కదా ఈ అమ్మాయి. లేకుంటే చిక్కడపల్లి బ్యూటీ శాంతి అయినా అయి ఉండాలి. మూడు నెలల నాడు తను పెళ్లి చూపుల్లో చూసిన శాంతీ, ఈ అమ్మాయీ ఒకరేనేమో!

ఏదైనా సుబ్బారావు కళ్ళముందు ఓ మెరుపు తీగ కదలాడింది. ఇవన్నీ ఆలోచిస్తుంటే మనసులో కాస్త అశాంతి కూడా మొలకెత్తింది. ఇక ఆగలేకపోయాడు సుబ్బారావు.

కవరు అంచును నీటుగా చించాడు. లోపల్నుంచి కాగితం బయటికి తీశాడు.

అందమైన పూల డిజైన్ తో, ముచ్చటైన నునుపైన కాగితం, దానిపై మురిపించే అందమైన అక్షరాలు. కన్నుల పండుగగా ఉం.ది చూపు స్కూటర్ కంటే వేగంగా అక్షరాల మీదకు మళ్ళింది.

“ ప్రియమైన సుబ్బారావ్,

నువ్వు ఎలా ఉన్నావు...

ఎన్నాళ్ళు నన్ను ఇలా కవ్విస్తావు...

ఎంత స్మార్ట్ గా ఉన్నావ్...

నిన్ను కలవడం ఎలాగమ్మా...

నిన్ను పెళ్లాడితే నా జన్మ ధన్యమేనమ్మా..

అన్నట్టు సుబ్బారావ్..

నీకు ఓ సర్ప్రైజ్ ఇవ్వాలనుకుంటున్నాను

ఈరోజు రాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కి రా. ఏ 1 కోచ్ దగ్గర ప్రయాణానికి సిద్ధంగా ఉన్న గోదావరి ఎక్స్ప్రెస్ దగ్గర తూర్పువైపు తిరిగి నిలబడి ఉంటాను. తలలో ఎడమవైపున గులాబీ, అదే రంగు చీర, అదే రంగు గాజులు...

నీతో మాట్లాడడానికి సిద్ధంగా ఉంటాను

నిన్ను చూడాలని ఆత్రంగా ఉంది సుబ్బారావ్

నీకు మరో సర్ప్రైస్

నువ్వు రైల్వే స్టేషన్ కి వచ్చేటప్పుడు నీ మది తలుపులే కాదు, మీ ఇంటి తలుపులు కూడా తెరిచి ఉంచు. నువ్వు నన్ను కలిసి ఇంటికి తిరిగి వెళ్ళాక ఇంటి నిండా గులాబీల పరిమళం గుబాళిస్తుంది.

సికింద్రాబాద్ స్టేషన్ కి వస్తావు కదూ..

నీకోసం బోగి తలుపులే కాదు, నా హృదయ కవాటం కూడా తెరిచే ఉంటుంది.

ఇప్పటికే నీ మనసులో ఆశలు రేకెత్తించానేమో.

ఇక ఉంటాను –నీ శాంతి."

ఉత్తరం ఒక కవితలా సాగింది.

మనసులోకి శాంతి పవనం ఎగబాకింది. ఆమె చెప్పింది చేయాల్సిందే అని నిర్ణయించుకున్నాడు.

★★★

సికింద్రాబాద్. అటు ఇటు హడావుడిగా తిరిగే జనంతో రైల్వే స్టేషన్ కిటకిటలాడుతోంది. సుబ్బారావు చూపులు కాంతిపుంజాలై శాంతి కోసం శోధిస్తున్నాయి. తలలో గులాబీ కోసం తహతహలాడుతున్నాయి. అదే రంగు చీర, గాజుల కోసం ఆరాట పడుతున్నాయి.

ఏ1 బోగి దగ్గరికి వచ్చాడు సుబ్బారావు. రైలు కదిలే సమయం ఆసన్నమయ్యింది లేఖలో రాణి రేఖలు కూడా కనిపించడం లేదు.

రైలు కదిలింది.

గులాబీబాల గుబులు ఇంకా మనసును వీడడం లేదు. ఆమె ఎక్కడా కనబడలేదు. ఒక్క క్షణం నిస్సత్తువ ఆవహించింది. వెంటనే హఠాత్తుగా మరో విషయం గుర్తొచ్చింది .తన ఇంటి తలుపులు తెరిచి ఉంచాలని, తిరిగి వచ్చేసరికి గులాబీ ఘుమఘుమలు సిద్ధంగా ఉంటాయని లేఖలో చెప్పిన విషయం గుర్తొచ్చింది.

ఈ సర్ ప్రైజ్ ను చవి చూడాలనిపించింది.

★★★

కారు వేగంగా పరిగెత్తుతోంది. మనసు ఇంకా ముందుకు దూకుతోంది. ఆత్రంగా ముంగిట్లో వాలిపోయాడు సుబ్బారావు.

తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. ఖరీదైన సామాన్లు ఏమీ కనిపించడం లేదు. ఇల్లు ఖాళీగా బోసిగా వెక్కిరిస్తున్నది. నివ్వెరపోయాడు సుబ్బారావు.

గుండె గుభేల్ మంది మనసు నష్టాన్ని లెక్కిస్తోంది.

సుబ్బారావు చూపులు వరండాలో ఉన్న స్టూల్ పై పడ్డాయి, రెపరెపలాడుతున్న ఓ కాగితం ముక్కా, దాని పైన కొన్ని గులాబీ రేకులు కనిపిస్తున్నాయి. సుబ్బారావు వెళ్లి గులాబీ రేకులు తొలగించి కాగితం ముక్క ను పరికించి చూశాడు.

అది ఓ సినిమా టికెట్.

“చెవిలో పువ్వు” సెకండ్ షో చూసి ఆనందించమని రాసి ఉంది.

సుబ్బారావు మెదడును అశాంతి ఆక్రమించింది.

– సోమేపల్లి వెంకట సుబ్బయ్య
+91 9966460536